సాక్షి
తిరుపతి

శుక్రవారం : 20 : జూన్ : 2025



మహిళల రక్షణకు అండగా నిలుస్తాం
మహిళల రక్షణకు జాతీయ మహిళా కమిషన్ అండగా నిలబడుతుందని కమిషన్ సభ్యురాలు పేర్కొన్నారు. - 10లో



ప్రయాణం.. ప్రయాస
తిరుపతి జిల్లా నుంచి విశాఖకు 30 ఆర్టీసీ బస్సులు తరలించడంతో ప్రయాణికులు బస్సుల కోసం అవస్థలు పడ్డారు. - 10లో



భక్తులకు మెరుగైన సేవలు
తిరుమల శ్రీవారి భక్తులతో ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరించి మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఈఓ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

రేపు ఎస్వీయూ స్టేడియంలో యోగాంధ్ర

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 3 వేల మంది విద్యార్థులతో పాటు జిల్లా యంత్రాంగం పాల్గొంటున్న ఈ యోగా కార్యక్రమానికి సుమారు 7 వేల మంది హాజరవుతారని తెలిపారు. 21వ తేదీ ఉదయం 5.45 నుంచి 7.15 వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

21, 22న చెన్నై మెమో రైలు రద్దు

నాయుడుపేటటౌన్ : చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే మెమో రైలు ఈనెల 21, 22 తేదిలలో (శని, ఆదివారం) రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి గురువారం తెలిపారు. పోన్నేరి తదితర ప్రాంతాల్లో రైల్వే లైన్‌ల మరమ్మతుల కారణంగా మెమో రైలు రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ వెల్లడించారు.

శ్రీసిటీ సీఎఫ్‌ఓకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న నాగరాజన్

శ్రీసిటీ (సత్యవేడు): ముంబైలో ఈనెల 18న జియో వరల్డ్ కన్వెన్షన్‌లో జరిగిన 8వ వార్షిక బిజినెస్ వరల్డ్ సీఎఫ్‌ఓ వరల్డ్ ఫైనాన్స్ స్ట్రాటజీ ఎక్సలెన్స్ అవార్డుల్లో శ్రీసిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ) ఆర్.నాగరాజన్‌కు ప్రతిష్టాత్మక బెస్టు సీఎఫ్‌ఓ ఇన్ స్మాల్ ఎంటర్‌ప్రైజ్ అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఆర్థిక ప్రణాళిక, పనితీరుకు ఆయనకు అవార్డు దక్కింది.

గురుకులాల ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

– 25న శ్రీకాళహస్తిలో ప్రవేశ పరీక్ష

తిరుపతి అర్బన్ : జిల్లాలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26కు సంబంధించి 6,7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర పాఠశాలలకు సంబంధించి నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడు గురుకుల స్కూల్‌లోనూ, అలాగే బాలికలకు సంబంధించి పుదూరు, సూళ్లూరుపేట,డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరు పాఠశాల్లోని మిగులు సీట్లు ఉన్నాయని చెప్పారు. వాటిని భర్తీ చేయడానికి ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయ్యో మామిడి!





తవణంపల్లిలో ర్యాంపుల వద్ద తమిళనాడుకు తరలించడానికి నిల్వ ఉంచిన మామిడి కాయలు

''అష్టకష్టాలు పడ్డాం. నీళ్లునిప్పులు లేని భూములు వేలకువేలు అప్పు చేసి చదును చేశాం. కొత్త రకాల మామిడి వంగడాలను తీసుకొచ్చి సాగుచేశాం. ఎండావానకు తట్టుకుని అనుకున్న విధంగానే దిగుబడి వచ్చింది. అప్పులు తీరుతాయని ఆశపడ్డాం. కానీ ఏం లాభం...? గిట్టుబాటు ధరలేక.. సకాలంలో విక్రయించుకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో రోడ్డున పడేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గుజ్జు పరిశ్రమల వద్ద టోకెన్ల కోసం.. అన్‌లోడ్ కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇలాంటి దారుణ పరిస్థితి వస్తాదని కలలో కూడా ఊహించలేదు..' అంటూ మామిడి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఫ్యాక్టరీల వద్ద నిరీక్షించలేక సహనం నశించి ఇంటి ముఖం పడుతున్నారు. చూపరులు వీరిని చూసి.. అయ్యో..దేవుడా! అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

గిట్టుబాటు కాని ధర

- కిలో రూ.8 కాదు..రూ.5కే కొనుగోలు చేస్తామంటున్న గుజ్జు పరిశ్రమలు
- అడిగిన ధరకు విక్రయించకపోతే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తామంటూ బెదిరింపులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రోడ్డెక్కిన మామిడి రైతులు
- నోరెత్తని రైతు సంఘాలు, కూటమి ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు అల్లాడిపోతున్నారు. కూటమి నేతల మాటలకు, చేతలకు పొంతన లేకపోవడంతో రోడ్డెక్కుతున్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు గత సోమవారం బంగారుపాళెం, గంగాధరనెల్లూరు, చిత్తూరులో నడిరోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 80వేల హెక్టార్లకుపైగా మామిడి పంట సాగులో ఉంది. అందులో తోతాపురి సుమారు 50వేల హెక్టార్లలో సాగవుతోంది. దిగుబడి కూడా ఆశాజనకంగానే వచ్చింది. ఎండలు, ఈదురు గాలులను తట్టుకుని మామిడి పంట నిలబడింది. రైతులు కూడా సంబరపడిపోయారు. అధికారుల అంచనా ప్రకారం ఈ సీజన్‌లో తోతాపురి రకం 60వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మిగిలిన నీలం, అల్ఫోన్సో, బేనీషా, మల్లిక వంటి రకాలు మరో లక్ష మెట్రిక్ టన్నుల కుపైగా దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మామిడి కోతలు పూర్తి చేసిన రైతులు పంట విక్రయించుకునేందుకు చిత్తూరు, పలమనేరు, దామలచెరువు, బంగారుపాళెం, తిరుపతి, పాకాల మార్కెట్లకు తరలివస్తున్నారు. అక్కడ ధరలు విని షాక్‌కు గురవుతున్నారు.

అందుకేనా ఈ బరితెగింపు!

తమిళనాడులో మామిడి దిగుబడిని చూసుకుని గుజ్జు పరిశ్రమల యజమానులు రెచ్చిపోతున్నారు. తాము సూచించిన ధరకే విక్రయించాలని బెదిరింపులకు దిగుతున్నారు. తమిళనాడులోని క్రిష్ణగిరి నుంచి తోతాపురి కాయలను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ కేజీ రూ.4 కొనుగోలు చేసి రూ.5కు ఫ్యాక్టరీకి అన్‌లోడింగ్ అయ్యేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

ప్రభుత్వం వాటాను కొట్టేసే కుట్రలు

కిలో మామిడికి రూ.4 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించిన నేపథ్యంలో గుజ్జు పరిశ్రమల వారు, టీడీపీ నేతలు ఆ సొమ్మును కొట్టేసేందుకు కుట్రకు తెరలేపారు. తమిళనాడులోని మామిడిని తక్కువ ధరకు కొనుగోలు చేసి.. ఏపీకి తీసుకొచ్చి రైతుల ముసుగులో గుజ్జు పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. నిజమైన రైతులు మాత్రం మామిడి దిగుబడులతో రోడ్డుపై రోజుల తరబడి వేచి ఉంటే.. బినామీ రైతుల అవతారం ఎత్తిన వారు తమిళనాడు నుంచి కొనుగోలు చేసి వెంటనే పరిశ్రమల వారికి విక్రయించి అధికారులకు వివరాలు పంపుతున్నారు.

వ్యాపారుల సిండికేట్

ఉమ్మడి జిల్లాలోని ఫ్యాక్టరీ నిర్వాహకులు, వ్యాపారులు సిండికేట్ అయ్యారు. తోతాపురి అధిక దిగుబడిని సాకుగా చూపి ధరలను తగ్గించేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు పరిశ్రమల వద్ద అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఊదరగొట్టుకునే పనిలో పడ్డారు. ఫ్యాక్టరీలు రూ.8, ప్రభుత్వ ప్రోత్సాహ నిధి కింద కిలోకు మరో రూ.4, వెరసి మొత్తం కిలోకు రూ.12 వస్తుంది అని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం వ్యాపారులు ఫ్యాక్టరీలతో కుమ్మక్కై ర్యాంపులు ఏర్పాటు చేసుకుని కేజీ రూ.4కే కొనుగోలు చేస్తున్నారు. దీనిపై వరుసగా ఫిర్యాదులు చేయడంతో అధికారులు గుజ్జు పరిశ్రమల వారితో సమావేశమయ్యారు. రెండు వారాల క్రితం చిత్తూరు జిల్లా కలెక్టర్ కిలో రూ.8కు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత తిరుపతి జిల్లా కలెక్టర్ కూడా వ్యాపారులతో సమావేశమై ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మామిడిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. అయితే గుజ్జు పరిశ్రమల యాజమాన్యం పట్టించుకోలేదు.



ఫ్యాక్టరీ గేటుకు ధరల పట్టిక

మంత్రి ఆదేశాలు బేఖాతర్

ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చిత్తూరుకు చేరుకుని వ్యాపారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కిలో మామిడి రూ.8 చొప్పున గుజ్జు పరిశ్రమలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి మరో రూ.4 చొప్పున రైతులకు అదనంగా చెల్లిస్తామని పేర్కొన్నారు. గుడిపాలలోని ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం రూ.6 చొప్పున కొనుగోలు చేస్తోంది. మిగిలిన పరిశ్రమల వారు కిలో రూ.5కే కొనుగోలు చేస్తున్నారు. పరిశ్రమల యజమానులంతా సిండికేట్‌గా మారడంతో జిల్లాలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సిఫార్సులున్న వారికే టోకెన్లు

అధికారుల ఒత్తిడితో కొన్ని ఫ్యాక్టరీలు మామిడి కాయలలు కొనుగోలు కు టోకన్ల ప్రక్రియను తీసుకొచ్చాయి. ఫ్యాక్టరీలు జారీచేసే టోకన్ల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. అయితే ఫ్యాక్టరీలు మాత్రం అరకొర టొకెన్లు జారీచేసి చేతులు దులుపుకుంటున్నాయి. మిగిలినవి కూటమి పార్టీలు చెప్పిన వారికే టోకెన్లు ఇస్తూ రైతులను రోడ్డున పడేస్తున్నాయి. సిఫారస్సు తెచ్చుకుంటేనే టోకెన్లు అంటూ ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతుండడం గమనార్హం. టోకన్లు జారీ చేసే సమయానికి నీకా..నాకా అంటూ పోటీపడుతున్నారు. తోపులాటలు జరుగుతున్నాయి. గంగాధరనెల్లూరు, పూతలపట్టు, చిత్తూరు, గుడిపాల, తవణంపల్లి, రేణిగుంట ప్రాంతాల్లో ఈ రకమైన సమస్యలు ప్రతి రోజూ ఎదురవుతున్నాయి. గత వారం రోజులుగా పరిశ్రమల వద్ద రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఇటు రైతులు, అటు వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించకపోవడంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



రేణిగుంట ఫ్యాక్టరీ ముందు బారులు తీరిన మామిడి కాయలతో ఉన్న లారీలు



ఫ్యాక్టరీ ముందు ఎదురుచూస్తున్న రైతులు

బాబుది ధృతరాష్ట్ర పాలన



పార్టీ నాయకులతో కలిసి చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

- చెవిరెడ్డి అక్రమ అరెస్టుపై ప్రజాగ్రహం
- నల్లజెండాలతో చంద్రగిరిలో నిరసన
- లిక్కర్ అక్రమ కేసుపై ఆవేదన
- నిరసనలో పాల్గొన్న చెవిరెడ్డి లక్ష్మి

చంద్రగిరి : రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో సీఎం చంద్రబాబుకు కళ్లకు గంతలు కట్టుకుని రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన సాగిస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. మద్యం స్కాం కేసుకు ఎలాంటి సంబంధం లేని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై ప్రజాగ్రహం పెల్లుబికింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం సాయంత్రం స్థానిక చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నల్లజెండాలతో నిరసనకు దిగారు. ఈ నిరసన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి హాజరయ్యారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చెవిరెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా నినాదాలు చేశారు.

ముమ్మాటికి వేధింపులే..

రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా మద్యం స్కాం పేరుతో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్‌ను ఈ కేసులో ఏ–39గా పేర్కొనడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన తమ నేతను విడుదల చేసే వరకు నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసినందుకా అక్రమ అరెస్టు : చెవిరెడ్డి లక్ష్మి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చెవిరెడ్డి లక్ష్మి, పార్టీ శ్రేణులు

పార్టీలకతీతంగా తన భర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినందుకా ఆయనను మద్యం స్కాంలో ఇరికించి అరెస్టు చేశారని చెవిరెడ్డి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేసి ఉంటే ఏ శిక్షకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. వీధుల్లోకి ఏ రోజున రాని మేము.. ఈ రోజు వచ్చి మాట్లాడుతున్నామంటే మా ఆవేదనను ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. బిడ్డ, భర్త, కుటుంబం అని చూడకుండా ప్రతి ఒక్కరిని వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. మద్యం అంటేనే మండిపడే ఆయనపై ఇలాంటి కేసులు పెట్టడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఈ నియోజకవర్గానికి మేలు చేయడమే తాము చేసిన పాపమా అంటూ ఆమె ప్రశ్నించారు. ఏ నాడు చెవిరెడ్డి కక్ష పూరితంగా వ్యవహరించలేదని, ఇప్పుడు కూటమి ఏడాదిలోనే మా కుటుంబాన్ని లక్ష్యంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆమె ఆవేదన చెందారు.

అవి పచ్చ పార్టీకి కొత్తేమీ కాదు



నగరి: యువకుల జీవితాలతో చెలగాటాలు పచ్చపార్టీకి కొత్తేమీ కాదని మాజీ మంత్రి రోజా అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే రప్పారప్పా కోస్తాం అంటూ పల్నాడు జిల్లా రెంటపాళ్లలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూడడానికి వచ్చిన జనంలో నుంచి ఒక యువకుడు ప్లకార్డు చూపడంతో వచ్చిన వివాదాలపై ఆమె గురువారం స్పందించారు. ప్లకార్డు ప్రదర్శించిన రవితేజను సత్తెనపల్లి పోలీసులు అరెస్టు చేశారని, నిజానికి రవితేజ టీడీపీకి చెందిన వ్యక్తి అన్నారు. ఉద్దేశపూర్వకంగా అలజడి సృష్టించడానికి టీడీపీ చేసిన కుట్ర అని తేటతెల్లమైందన్నారు. తమ బిడ్డ టీడీపీలో ఉన్నాడని స్వయంగా వారి కుటుంబ సభ్యులు చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. రవితేజ టీడీపీ సభ్యత్వ నమోదు కార్డును కూడా వారు చూపెట్టినట్టు గుర్తుచేశారు. రవితేజను బలవంతంగా తీసుకువెళ్లడంతోనే ప్లకార్డులు పట్టుకున్నాడని తెలిపారు.

నిలిచిన సర్టిఫికెట్ల జారీ

తిరుపతి అర్బన్ : పాఠశాలలు, కళాశాలల ప్రవేశాలు, పోటీ పరీక్షల నేపథ్యంలో రెవెన్యూ కార్యాలయాల్లో వివిధ రకాల సర్టిఫికెట్స్ జారీ తాత్కాలికంగా ఆగిపోయింది. తహసీల్దార్ బదిలీల నేపథ్యంలో డిజిటల్ సంతకాల మార్పు కారణంగా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. రోజుకు జిల్లాలోని 34 మండలాల్లో 7 వేల నుంచి 8 వేల వరకు సర్టిఫికెట్స్ జారీ చేస్తూ ఉంటారు. అయితే ఈనెల 17న రెవెన్యూ బదిలీలు చేపట్టి జిల్లాలో 18 మండలాల్లో తహసీల్దార్ల మార్పు చేపట్టారు. ఈ క్రమంలో పాత తహసీల్దార్ డిజిటల్ సంతకాన్ని తొలగించారు. కొత్త తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత డిజిటల్ సంతకం అందుబాటులోకి రానుంది. ఈ క్రమంలో కొత్త తహసీల్దార్ వచ్చిన తర్వాతే సర్టిఫికెట్స్ జారీ ప్రక్రియ ఉంటుందని ఉద్యోగులు స్పష్టం చేశారు. మరోవైపు డిప్యూటీ తహసీల్దార్లు జిల్లాలో 22 మంది బదిలీ అయ్యారు. ఇంకోవైపు గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ), వీఆర్వోల బదిలీల జాబితాను వెల్లడిస్తారని చెబుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు చెందిన సర్టిఫికెట్స్ జారీ చేయడంలో నిర్లక్ష్యంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించడంపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు సర్టిఫికెట్స్ జారీలో జాప్యం తప్పేలాలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

లాసెట్‌లో అమ్మాయిల హవా

- తిరుపతి విద్యార్థినికి 2వ ర్యాంక్
- ఏపీ లాసెట్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 133 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఏపీ లాసెట్ పరీక్షా ఫలితాలు గురువారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, లాసెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ ఉమ ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్షకు 2092 మంది హాజరు కాగా 2076 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఎల్ఎల్‌బీ 5 ఏళ్ల కోర్సుకు 3867 హాజరు కాగా 3659 ఉత్తీర్ణులయ్యారు. ఎల్ఎల్‌బీ 3 ఏళ్ల కోర్సుకు 15,292 అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 15,091 ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఎల్ఎల్ఎమ్ ప్రవేశ పరీక్షలో 99.24 శాతం, ఎల్ఎల్‌బీ 3, 5 ఏళ్ల కోర్సుకు 98.69 శాతం, 94.62 శాతం ఉత్తీర్ణతగా నమోదైంది. ఈ ఏడాది లాసెట్‌లో మహిళలే పైచేయి సాధించారని చెప్పారు.



రెండో ర్యాంక్ సాధించిన విద్యార్థిని భావన

రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎల్ఎల్‌బీ 5 ఏళ్ల కోర్సుకు జరిగిన ప్రవేశ పరీక్షలో తిరుపతి వైకుంఠపురానికి చెందిన సింగమల భావన 107 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి ఈశ్వరయ్య తిరుపతి రైల్వే స్టేషన్‌లో లోకో పైలట్‌గా పనిచేస్తుండగా తల్లి సత్యవేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని లాసెట్‌లో రెండో ర్యాంక్ రావడం సంతోషంగా ఉందని చెప్పారు.

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

– మూడు కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయిని చూపుతున్న పోలీసులు

రేణిగుంట : గంజాయిని రాష్ట్రాలు దాటిస్తున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర తెలిపారు. పోలీసుల కథనం మేరకు... విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రేణిగుంట సీఐ జయచంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్ సమీపంలోని కార్ పార్కింగ్ పరిసరాల్లో అనుమానంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని బ్యాగులను తనిఖీ చేయగా 50,000 విలువచేసే మూడు కేజీల గంజాయిని గుర్తించారు. విచారించగా కర్ణాటక రాష్ట్రంకు చెందిన భరత్, దినేష్ , నితేష్, ఒడిస్సాకు చెందిన జోగిందర బచ్చా గా గుర్తించారు. వారు గంజాయిని ఒడిశా నుంచి తీసుకొని కర్ణాటకకు తరలించాలనే ఉద్దేశంతో ప్రయాణిస్తూ మార్గం మధ్యలో రేణిగుంట వద్ద దిగగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

ప్రయాణం..ప్రయాస

- యోగాంధ్రకు 30 ఆర్టీసీ బస్సులు
- జిల్లా నుంచి విశాఖపట్నంకు తరలింపు
- నాలుగు రోజులు ప్రయాణికులకు తప్పని పాట్లు

తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లా నుంచి బుధవారం రాత్రి 30 ఆర్టీసీ బస్సులు విశాఖపట్నంకు వెళ్లాయి. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమానికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. తిరిగి ఈనెల 22 రాత్రికి లేదా 23 తెల్లవారుజామున తిరుపతికి చేరుకుంటాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో బుధవారం రాత్రి నుంచి తిరుపతి బస్టాండ్‌తో పాటు జిల్లాలోని పలు బస్టాండ్లలో బస్సుల కొరతతో ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులు గంటల కొద్దీ బస్సుల కోసం పడిగాపులు పడ్డారు. ఎక్స్‌ప్రెస్‌లు 30 విశాఖపట్నంకు తరలించడంతో పల్లె వెలుగు బస్సులను జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలకు తిప్పుతున్నారు.

ఇటీవల మహానాడుకు 220 బస్సులు

పీఎం నరేంద్ర మోదీ ఇటీవల అమరావతికి వస్తుండంతో తిరుపతి జిల్లా నుంచి 85 సర్వీసులు పంపించారు. ఆ తర్వాత కడపలో టీడీపీకి చెందిన మహానాడు సమావేశానికి 220 బస్సులను తిరుపతి జిల్లా నుంచి తరలించారు. తాజాగా విశాఖపట్నంలో తిరుపతి నుంచి 30 సర్వీసులను బుధవారం రాత్రి పంపించారు. దీంతో ఈ నాలుగైదు రోజులు ప్రయాణికులకు అగచాట్లు తప్పవని పలువురు మండిపడుతున్నారు.



తిరుపతి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ముందే బస్సుల కొరత

జిల్లాలోని 11 డిపోల్లో 774 సర్వీసులు ఉన్నాయి. వీటిలో నిత్యం 74 సర్వీసులు మరమ్మతుల్లో ఉంటున్నాయి. మిగిలిన 700 సర్వీసులు ప్రయాణికుల సంఖ్యతో పోల్చుకుంటే చాలడం లేదు. జిల్లాకు 1100 సర్వీసులు అవసరం ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే 400 సర్వీసులు తక్కువ ఉన్నాయి. దీనికి తోడు కూటమి సర్కార్ పదే పదే ఆర్టీసీ సర్వీసులను వాడేస్తున్నారు. దీంతో 94 అద్దె బస్సులను ఆర్టీసీ తీసుకుని నడుపుతోంది. అయినప్పటికీ ముఖ్యమైన ఆలయ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడపలేకపోవడంతో ప్రయాణికులు నానా తిప్పలు పడుతున్నారు.

తల్లికి వందనం ఇప్పించండి

- కలెక్టరేట్‌లో సమస్యలు వెల్లువ

తిరుపతి అర్బన్ : కూటమి సర్కారులో అన్ని విభాగాల్లోను అలజడి తప్పడం లేదు. క్లస్టర్ పేరుతో సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, రేషన్ డీలర్లు, పాఠశాలల కుదింపు చేస్తుండడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తల్లికి వందనం పథకం అందకపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో తమ సమస్యలపై పలువురు గురువారం కలెక్టరేట్ వద్ద అధికారులకు తమ సమస్యలను విన్నవించుకున్నారు.

నాకు ఇద్దరు బిడ్డలు ఎవ్వరికీ వేయలేదు



ఆవేదన చెందుతున్న రమాదేవి దంపతులు

నా పేరు రమాదేవి, భర్త జయచంద్ర. మాది సూళ్లూరుపేట మండలంలోని మంగా నెల్లూరు గ్రామం. మాకు ఇద్దరు బిడ్డలు ఉన్నారు. అంకిత(12) 8వ తరగతి, చైతన్య(14) 10వ తరగతి మంగళం పాడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తెల్లరేషన్ కార్డు ఉంది. రైతు కూలీలుగా జీవనం సాగిస్తున్నాం . అయితే తల్లికి వందనం పథకం కింద మాకు నగదు పడలేదు. దీంతో కలెక్టరేట్‌కు వచ్చాం.

–సాలు రమాదేవి, జయచంద్ర దంపతులు

పాఠశాలల విలీనం ఆపండి



పాఠశాలల విలీనంతో వచ్చే ఇబ్బందులను కలెక్టర్‌కు వివరిస్తున్న సీపీఎం,ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతలు

పాఠశాలలను విలీనంతో ఇబ్బందులు వస్తున్నాయంటూ సీపీఎం, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండలంలో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరపురం పాఠశాలను పరమాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు, అలాగే అదే మండలంలోని పీపీపురం పాఠశాలను బలిజపల్లి గ్రామంలోని పాఠశాలకు మార్పు చేయడాన్ని తప్పుపట్టారు. దీంతో విద్యార్థులకు వచ్చే ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు జయచంద్ర, సుమన్, సాయిలక్ష్మి, వినోద్‌కుమార్, తేజ పాల్గొన్నారు.

మా ఊరి పాఠశాలను తొలగించడం అన్యాయం



విలీనం ఆపాలని కోరుతున్న చిన్నసింగమాల గ్రామస్తులు

తొట్టంబేడు మండలంలోని చిన్నసింగమాలలో 7 దశాబ్దాలుగా పాఠశాల ఉంది. అయితే మా పాఠశాలను క్లస్టర్ పేరుతో గురుకుల పాళెం గ్రామంలోని పాఠశాలకు మార్పు చేస్తున్నారు. 3,4 తరగతులను మార్పు చేసినట్లు చెబుతున్నారు. నాలుగు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి ఉంది. మార్గ మధ్యలో వంతెన ఉంది. ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి. మా పాఠశాలను మా గ్రామంలోనే ఉంచాలంటూ చిన్న సింగమాల గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు డీఈవోను కలిశారు.

ఐఐటీ కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో నడుపుతున్న ఐఐటీ కేంద్రీయ విద్యాలయంలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఆసక్తి ఉన్న తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమేష్ గురువారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 21 నుంచి 25 సాయంత్రం 4గంటల లోపల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

ఖాళీల వివరాలు ఇలా..

1వ తరగతిలో 01–ఎస్టీ, 01–సీడబ్ల్యూఎస్ఎన్, 2వ తరగతిలో 01–ఎస్టీ, 3వ తరగతిలో 01–ఎస్టీ, 4వ తరగతిలో 26, 5వ తరగతిలో 01–ఎస్సీ, 01– ఎస్టీ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు తిరుపతి ఐఐటీ కేంద్రీయ విద్యాలయ అధికారిక వెబ్‌సైట్ https:// iittirupati.kvs.ac.in ను సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళల రక్షణకు అండగా నిలుస్తాం

- కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ
- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్



మాట్లాడుతున్న జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్, కలెక్టర్, ఎస్పీలు

తిరుపతి అర్బన్ : మహిళల రక్షణకు.. వారి హక్కుల పరిరక్షణకు మహిళా కమిషన్ కృషి చేస్తోందని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్ వెల్లడించారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్, మహిళా జన్ సున్వై అనే కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ పలువురు మహిళల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటికి పరిష్కారం చూపలేకపోవడానికి కారణాలను అధికారులు వెల్లడించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని...వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. తిరుపతి జిల్లాలోను కేసుల సంఖ్య ఎక్కువగానే ఉందని వెల్లడించారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం 24 గంటలు హెల్ప్‌లైన్, మెయిల్ అందుబాటులో ఉందని...వాటి ద్వారా ఫిర్యాదులు చేయవచ్చునని చెప్పారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం, వారి సమస్యలను చెప్పుకోవడానికి ఇది ఒక మంచి వేదిక అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన ప్రతి సమస్యను పర్సనల్‌గా తీసుకొని పరిష్కారం చూపేలా మహిళా కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. తిరుపతి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీవ్ర అసంతృప్తిలో మహిళలు

నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ సభ్యులు డాక్టర్ అర్చన మజుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా ఆయా శాఖల సమక్షంలో విచారించే కార్యక్రమంపై పలువురు మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపకపోగా తిరిగి కొత్తగా ఫిర్యాదు చేయాలనే సమాధానమే చెప్పడంతో నిరాశ చెందారు. పోలీసులు మహిళలను వేధిస్తున్న సమస్యలే అధికంగా వచ్చాయి. అయితే వీటి పరిష్కారానికి మళ్లీ పోలీసులనే కలవమని చెప్పడంపై అసంతృప్తికి గురయ్యారు. అధిక సంఖ్యలో వయోవృద్ధులు చిన్నపిల్లలతో మహిళలు హాజరై మధ్యాహ్నం భోజనం కూడా లేకుండా నిరీక్షించినప్పటికీ సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోవడంతో అనేక మంది మహిళలు నిరాశతో వెనుదిరిగారు.

విప్ ధిక్కరణపై వేటు వేయండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

- కమిషనర్‌ను కోరిన మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

తిరుపతి తుడా : రూ.కోట్లు విలువ చేసే మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించాలని కౌన్సిల్ అజెండాలో పొందు పరిచిన 71వ అంశాన్ని వ్యతిరేకిస్తూ ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు విప్ జారీ చేశామని, దాన్ని ధిక్కరించిన కార్పొరేటర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని నగర మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు కమిషనర్ మౌర్యను కోరారు. గురువారం కమిషనర్‌ను కలిసి ఆధారాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మీడియాతో మాట్లాడారు. బుధవారం నిర్వహించిన మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించాలన్న ప్రతిపాదనను 47 మంది సభ్యుల్లో 35 మంది వ్యతిరేకించారన్నారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి పార్టీ స్టాండ్‌కు వ్యతిరేకంగా 10 మంది ఓటు వేశారన్నారు. కౌన్సిల్ ముందు రోజు 71వ అజెండా మున్సిపల్ కార్పొరేషన్ స్థల విక్రయాన్ని వ్యతిరేకించాలని విప్ జారీ చేశామని ఆమె గుర్తు చేశారు. కానీ కొంత మంది కార్పొరేటర్లు విప్ ధిక్కరించారని చెప్పారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరామన్నారు. అయితే ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ప్రతిపాదించిన కమిటీకి ఆమోదం అంటూ కొన్ని పత్రికల్లో పచ్చి అబద్ధాలు రాయడం సిగ్గుచేటు అన్నారు. 35 మంది సభ్యులు కార్పొరేషన్ స్థల అమ్మకాన్ని ఎమ్మెల్యే ప్రతిపాదించిన కమిటీ నియామకాన్ని పూర్తిగా వ్యతిరేకించారని ఆమె గుర్తు చేశారు.

కమిటీ ప్రతిపాదనకూ వ్యతిరేకమే

మున్సిపల్ కార్పొరేషన్ స్థల విక్రయం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, అలాంటిదే జరిగితే తిరుపతికి ద్రోహం చేసినట్లేనని నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. ఇదే విషయాన్ని కౌన్సిల్ ముక్త కంఠంతో మెజారిటీ సభ్యులు వ్యతిరేకించారన్నారు. కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించేందుకు 47 మంది సభ్యుల అభిప్రాయాలలో 35 మంది వ్యతిరేకించామన్నారు. అలానే ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు స్థల విక్రయంపై నిపుణులతో కమిటీ వేయాలన్న ప్రతిపాదనను 35 మంది సభ్యులు వ్యతిరేకించామని ఆమె స్పష్టం చేశారు. కౌన్సిల్ తీర్మానాన్ని కాదని కమిటీ ఏర్పాటుకు అధికారులు అత్యుత్సాహం చూపితే చట్టం ముందు దోషులుగా నిలబెడతామని మేయర్‌తో పాటు కార్పొరేటర్లు హెచ్చరించారు. స్థలాన్ని అమ్మకపోతే ఆక్రమణల నుంచి కాపాడుకోలేమనేలా కమిషనర్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆరణి సంధ్య, ఆదం రాధాక్రిష్ణారెడ్డి, పి అమరనాథ్‌రెడ్డి, ఉమ అజయ్, షాలిని, కోటేశ్వరమ్మ, ఆంజనేయులు, బోకం అనిల్, రాజమ్మ, సుజాత పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురానికి కూతవేటు దూరంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. 40 ఏళ్లు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి చిన్న చెట్టుకు తన చొక్కాతోనే ఉరి వేసుకున్న ఘటన చూస్తుంటే పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఆత్మహత్య చేసుకున్నాడా...లేక ఎక్కడో కొట్టి చంపి ఇక్కడ ఉరివేసినట్లు చిత్రీకరించారా అని ప్రజలు అనుమానిస్తున్నారు. ఎస్ఐ క్రాంతి కుమార్ అందించిన వివరాల మేరకు మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని పాదలకూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఓ 40 ఏళ్ల వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన చోటు చేసుకుందన్నారు. ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశామన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఈ ఘటనపై కేసును నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు.

సివిల్స్ పరీక్షపై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: ఢిల్లీకి చెందినది ఎకనామిక్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్, తిరుపతికి చెందిన శ్రీవిద్య ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కెన్సెస్ హోటల్‌లో సివిల్స్ పరీక్షపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ గణపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సివిల్స్ శిక్షణలో నిపుణులైన ఢిల్లీకి చెందిన తేజ్‌వీర్ సింగ్, సూరజ్‌చౌదరి, సిద్దులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7013119918 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళ దారుణ హత్య

– గొంతు కోసి నగలు దోపిడీ

నాగలాపురం : ఒంటరి మహిళను దారుణంగా హత్య చేసి, ఆమె మెడలోని బంగారు చైను, ఇతర నగలను దుండగులు అపహరించిన ఘటన పిచ్చాటూరు మండలంలోని అడవికొడియంబేడు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. పిచ్చాటూరు మండలంలోని అడవి కొడియం బేడు హరిజనవాడకు చెందిన లేట్ శ్రీనివాసులు భార్య సి.కల్పన (40) క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈక్రమంలో ఇంటిలో ఆమె ఒక్కరే నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ఇంటిలోకి ప్రవేశించి కత్తితో ఆమె పై తీవ్రంగా దాడి చేసి ఆమె గొంతు కోసి హత్య చేసి మెడలోని బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయింది. మృతి చెందిన మహిళకు డిగ్రీ చదువుతున్న కుమారుడు ఉన్నాడు. భర్త మృతి చెందడంతో ఒంటరిగా ఉంటోంది. గురువారం తెల్లవారుజామున కల్పన ఇంటి వద్ద రక్తమడుగులో పడి ఉండడంతో గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ మురళీనాయుడు, ఎస్ఐ వెంకటేష్ క్లూస్ టీంతో చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కల్పన హత్యకు గురైన కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కల్పన కుమారుడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్ర చందనం కేసులో ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్ : అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్ర చందనం చెట్లను నరకడానికి ప్రయత్నించిన కేసులో తమిళనాడుకు చెందిన పరమన్ అన్బుకు అయిదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. 2017 సంవత్సరంలో నిందితుడు అన్బు తిరుపతి కృష్ణాపురం సెక్షన్, కరకంబాడి బీట్, శేషాచలం అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్ర చందనం చెట్లను నరకడానికి ప్రయత్నించగా టాస్క్ ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు. నేరం అన్బుపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతడికి శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

భక్తులకు మరింత మెరుగైన సేవలు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయాలను సేకరించి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ ఈఓ శ్యామల రావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయ సేకరణపై వివిధ విభాగాల అధికారులలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ తిరుపతి, తిరుమల ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ మీద విజిలెన్స్, పోలీస్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి నిఘాను మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో వర్చువల్ ద్వారా అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీ కృష్ణ, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

యోగా డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, అధికారులు

పూణే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి, ఆయుష్ మంత్రిత్వశాఖ, మహిళా వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా ఈనెల 21న యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు యోగా దినోత్సవం పోస్టర్‌ను గురువారం వర్సిటీలోని గాంధీ విగ్రహం వద్ద వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, ఏజీఎస్ గోపాలకృష్ణమూర్తి, అధ్యాపకులు ఆవిష్కరించారు.

– తిరుపతి సిటీ

మద్దతు ధరతో మామిడి కొనుగోలు



ఫ్యాక్టరీలో కూలీలు చేస్తున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

పాకాల : గిట్టుబాటు ధరకే మామిడిని కొనుగోలు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచనలు చేశారు. గురువారం రామిరెడ్డిగారిఇండ్లు గ్రామానికి సమీపంలోని మామిడి గుజ్జు పరిశ్రమను పరిశీలించారు. అక్కడి రైతులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే బాలిరెడ్డిపల్లి, దామలచెరువులోని ర్యాంపులను సందర్శించి రైతులతో మాట్లాడారు. కొందరు రైతులు రూ.4, మరి కొందరు రైతులు రూ.3కు కొనుగోలు చేస్తున్నారని తెలపడంతో ర్యాంప్ నిర్వాహకులపై మండిపడ్డారు. తక్కువ ధరకు కొనుగోలు చేసే ర్యాంప్ నిర్వాహకులు, సప్లయర్స్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మామిడి రైతులు దశల వారిగా కోతలు జరపాలని, అప్పుడే ర్యాంపుల వద్ద పడిగాపులు పడాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో డీహెచ్ఓ దశరధరామిరెడ్డి, తహసీల్దార్ సంతోష్‌సాయి, సీఐ సుదర్శన్‌ప్రసాద్, ఏఓ రవిచంద్రబాబు, ఉద్యాన అధికారి శైలజ, తదితరులు పాల్గొన్నారు.